క్లుప్తంగా

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా శ్రీలత ఎంపిక



హుజూర్‌నగర్‌రూరల్ : టీజీపీఎస్‌సీ సోమవారం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన పిన్నాని శ్రీలత ఉద్యోగానికి ఎంపికైంది. ఆమె రాష్ట్ర స్థాయిలో 243వ ర్యాంకు, 5వ జోన్‌లో 68వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం ఆమె గరిడేపల్లి మండలం కోనాయిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఈ సందర్భంగా ఆమెను సోమవారం కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

శిక్షణ పూర్తి.. సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు అందుకుంటున్న హరివిల్లు క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : నల్లగొండ జిల్లా కేంద్రంలో నేరేడుచర్ల హరివిల్లు ప్రెసిడెంట్ వీరవల్లి శ్రీలత, ఇంపాక్ట్ క్లబ్ నల్లగొండ ఇన్‌చార్జ్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన మోటివేషనల్ ట్రైనర్ శిక్షణ ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న నేరేడుచర్ల హరివిల్లు క్లబ్ సభ్యులు మాశెట్టి విశాల, చిత్తనూరు కళ్యాణి సోమవారం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

మునగాల : మండలంలోని ఆకుపాముల శివారులో నూతన శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాజుల లక్ష్మీనారాయణ సోమవారం దేవాలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేశగాని వెంకటేశ్వర్లు, వల్లపురెడ్డి రామిరెడ్డి, కాసాని వెంకటనారాయణ, విలాసకవి రమేష్‌రాజు, వీరబాబు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



పతకాలతో గురుకుల విద్యార్థినులు

నడిగూడెం : విజయవాడలో వైఎంకె అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి కప్ కరాటే నేషనల్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నడిగూడెం మండల కేంద్రానికి చెందిన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన అమరబోయిన అశ్విత కట్టా విభాగంలో సిల్వర్ మెడల్, మర్రి మిశ్రిత, తాళ్లపాక బెస్లీ.. కట్టా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయానికి మినీ వాటర్ కూలర్లు అందజేత

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి దాన్యాయి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన మనోజ్‌కుమార్ రెండు వాటర్ కూలర్లను సోమవారం బహూకరించారు. వాటిని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఫణిభూషణ మంగాచార్యులు, దుర్గాప్రసాద్‌వర్మ, లక్ష్మీనరసింహమూర్తి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్ : ఏపీకి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని తమ్మరబండపాలెంకు చెందిన సుల్తానీ రాము.. చిలుకూరు మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ రేటుకు విక్రయించేందుకు ఏపీకి తరలిస్తుండగా రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు ఆటోలో ఉన్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సివిల్ సప్లై డీటీ రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎందుకీ నిర్లక్ష్యం!

- కోదాడ పట్టణంలో రేయింబవళ్లు వెలుగుతున్న వీధి దీపాలు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- స్థానికులు విన్నవించినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నయానగర్‌లో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

కోదాడ : కోదాడ మున్సిపాలిటీ అధికారులు మొద్దు నిద్రను వీడడం లేదు. సమస్యలపై పట్టణ ప్రజలు ఫిర్యాదు చేసినా, పత్రికలు వెలుగులోకి తీసుకొచ్చినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజాధనం వృథా అవుతున్నా, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని, అనేకసార్లు విన్నవించినా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేయింబవళ్లు వీధి దీపాల వెలుగులు..

కోదాడడ పట్టణంలోని పలు వీధుల్లో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతున్నాయి. పగలు వీధి దీపాలు వెలగకుండా కనీసం ఆన్ ఆఫ్ స్విచ్‌లు కూడా ఏర్పాటు చేయలేదు. నయానగర్, శ్రీమన్నారాయణకాలనీ, భవానీనగర్, మాతానగర్ ఇలా పట్టణంలో అనేక కాలనీల్లో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో ప్రజా ధనం వృథా అవుతోంది. దీనిపై పలువురు స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు కరువయ్యాయి. ఆరు నెలలుగా వీధి దీపాలు పగలు వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పత్రికలు వెలుగులోకి తీసుకవచ్చినా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలుచోట్ల రాత్రి సమయాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మరుగుదొడ్లకు తాళాలు..

కోదాడ పట్టణంలో 80 వేల జనాభా ఉంటారు. 10 వేల మంది నిత్యం కోదాడ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్లు నిర్మించారు. కానీ వాటికి సంవత్సరాల తరబడి తాళాలు వేసే ఉంచుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఏడాది కాలంగా మరుగుదొడ్లను నిరుపయోగంగానే ఉంచుతున్నారు. ఖమ్మం క్రాస్ రోడ్డులోని మరుగుదొడ్లను ప్రారంభించి తాళాలు వేసి ఉంచారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూస్తాం.. చేస్తాం అంటూ చెప్తున్నారే తప్పా వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై 'సాక్షి'పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించినా మున్సిపాలిటీ అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదని పలువురు అంటున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావడానికి మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని, ప్రత్యేక అధికారులైనా దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ఖమ్మం క్రాస్ రోడ్డులో తాళాలు వేసి ఉన్న మరుగుదొడ్లు

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న వెంపటి వెంకటేశ్వరరావు

గరిడేపల్లి : ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించిన మండల ఆర్యవైశ్య సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఆర్యవైశ్యుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. ఇప్పటివరకు ఆర్యవైశ్య సంఘంలో సభ్యత్వం లేని వారు సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓరుగంటి శ్రీనివాస్, సతీష్‌కుమార్, ముచ్చర్ల గోపాలకృష్ణ, రాము, లక్ష్మణ్, పైడిమర్రి నరసింహారావు, శ్రీనివాస్, గెల్లి సతీష్‌కుమార్, రమేష్, వీరస్వామి, సురేష్, ప్రసాద్, శంకర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఆర్యవైశ్యుల అభివృద్ధికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కృషి చేస్తుందని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం చింతలపాలెంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జల్లా జనార్దన్, గరినె నాగేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా కేస నాగసాగర్‌ను నియమిస్తూ ఆయన నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కె.ఉదయ్‌కుమార్, నాగన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ఎంఈఓ భూక్యా సైదానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమరవరంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా, పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం శానం గోవర్ధన్, కాంప్లెక్స్ హెచ్ఎం పెనుగొండ శ్రీనివాస్, హైస్కూల్ హెచ్ఎం జహర్ ఆలం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వజ్రమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం



బాలనాగమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అంజలీపురంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, అంకమ్మ, పెద్దమ్మ తల్లి దేవాలయాల ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీచెన్నకేశవ నాట్యకళామండలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద, పద్యనాటకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ నాటకంలో ఆంధ్రా, తెలంగాణ సీనియర్ రంగస్థల కళాకారులు పోటీ పడి నటించారు. కార్యవర్ధిలుగా ప్రకాష్‌బాబు, రాంబాబు, బాలవర్ధిగా ఎస్‌కె.సైదులు, మాయల పకీర్‌గా డోర్నాల శంకరాచారి, తలారి రాముడుగా కృష్ణారావు, తిప్పడుగా బి.ధర్మయ్యగౌడ్, బసవేశ్వరుడిగా బి.సైదులు, పులిరాజుగా ఎం.కొండలు, బాలనాగమ్మగా వీరమణి, సంగుగా అశ్విని, లచ్చి, మంజరి పాత్రలలో శాంతి నటించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి, గొర్రె నాగరాజు, వీరారెడ్డి, కాశయ్య, ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజు దర్శకత్వం వహించగా డ్రస్ మేకప్ అద్దంకికి చెందిన బడేసాబ్ నిర్వహించారు.

'పది' విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



గరిడేపల్లి : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ పానుగోతు చత్రునాయక్



నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్‌లో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గరిడేపల్లి : పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు హాల్‌టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్‌లో..

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, మండలానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో పాటు సినీ గేయాలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, విజయకుమార్, సైదాబి, సూర్జహాన్, శ్రీనివాస్, రాములు, నెల్సన్, ఇందిరా తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

చిలుకూరు : మండలంలోని బేతవోలు, చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పది, తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని అలరించారు. బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు.. తల్లిదండ్రులను పాదపూజ చేశారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి పరీక్షలను రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గురువయ్య, చిలుకూరు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగాల మండలానికి మంచి పేరు తేవాలి

మునగాల : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

నడిగూడెం : మండలంలోని రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మాట్లాడారు. అనంతరం త్రిపురవరం గ్రామానికి చెందిన మరిగంటి శ్రీనివాసాచార్యులు, నాగేంద్రాచార్యులు తమ తండ్రి రంగాచార్యులు జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు జి.రామదాసు, వి.సుధాకర్, ఆర్.రాంబాబు, సీహెచ్.వీరబ్రహ్మం, శ్రీనివాసరావు, ఏ.రమేష్, ఎండి.జానీబేగం పాల్గొన్నారు.



చిలుకూరు : బేతవోలు జెడ్పీహెచ్ఎస్‌లో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



అనంతగిరిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ముస్కు శ్రీనివాసరెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : శంకుస్థాపన చేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్

అనంతగిరి : మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి చొరవతో మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండపల్లి వాసు, డేగ కొండయ్య, అంతయ్య, సత్యానందం, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ సోమవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, దేవాలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ శీలం ఆదెమ్మ, నర్సింహారావు, గోపి, వీరబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోదాడరూరల్ : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలోని గుడిబండ రోడ్డులో రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోద్దన్నారు. ప్రయాణికుల కోసం ఆటోను రోడ్డుపై కాకుండ పక్కకు ఆపాలన్నారు. ఆటోల్లో టేపు రికార్డులు పెట్టవద్దని హెచ్చరించారు. ఎవరైన ఆటో డ్రైవర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి వేలం పాట

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పూలు, బొమ్మలు అమ్ముకొనుటకు సోమవారం వేలంపాట నిర్వహించారు. రెండు సంవత్సరాల కాల పరిమితికి (2025– 2027) వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన మర్రికంటి నాగేశ్వరరావు రూ. 1. 32 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం దేవాదాయ పరిశీలకులు పి.ఏడుకొండలు ఆధ్వర్యంలో దేవాలయం హుండీని లెక్కించారు. రూ.1,03,361 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో చలపతి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు అలహరి నర్సింహాచార్యులు, అన్వేష్‌కుమార్‌చార్యులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న తారక్‌గౌడ్ మిత్రమండలి సభ్యులు

కోదాడరూరల్ : మండలంలోని ఎర్రవరం గ్రామానికి చెందిన కాకి షణ్ముఖరావు ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబానికి తెలంగాణ విద్య సమితి అధ్యక్షుడు పెండెం తారక్‌గౌడ్ మిత్రమండలి సభ్యులు, దాతల సహకారంతో రూ.47100 సేకరించి మృతుని కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి తమవంతు సహాయసహకారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండెం వెంకట్రాంగౌడ్, మామిడి కిషోర్, బాలేబోయిన ఉపేందర్ ఉన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

కోదాడరూరల్ : మండలంలోని పాత గుడిబండలో బొడ్రాయి (నాభిశిల)25వ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద కాపు యలమర్తి జానకిరాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, తూమాటి నాగిరెడ్డి దంపతులు, నరోత్తమరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శివాచారి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నేరేడుచర్ల : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని చిల్లేపల్లి బీసీ గురుకుల పాఠశాలల, కళాశాలలో సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందంతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించి మాటల్లాడారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలియజేయవద్దన్నారు. వాట్సాప్‌లో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేసి వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదులు చేయాలని, వేధింపులకు గురి చేస్తే 100 నంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు. ప్రిన్సిపాల్ అనుకరణ, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్యచారి, గురులింగం, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం



దాతలను సన్మానిస్తున్న ఎంఈఓ, ఎంఎస్‌ఓ

హుజూర్‌నగర్ : పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని మల్లన్ననగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను సోమవారం పాఠశాలలో సన్మానించారు. దాతలు డాక్టర్ హరికృష్ణ, జె.శంభయ్య, టి.ప్రసాద్, కోతి సంపత్‌రెడ్డి, వి.వెంకయ్య, కె.ఉపేందర్, జి.వెంకటరామయ్య, జె.మల్లయ్య, నాగమణి నాగేశ్వరరావు, సైదులు, చుక్కయ్య, జి.శ్రీనివాస్, రాంబాబు, బ్రహ్మం, కోటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఓ బి.శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం

చిలుకూరు : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పలువురు సీపీఎం నాయకులు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు, మండల కార్యదర్శి నాగేటి రాములు, నాయకులు ఎగ్గడి లింగయ్య, యానాల వీరస్వామి, లింగ మల్లయ్య, వీర మల్లయ్య, కిరణ్, లింగయ్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

మునగాల : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం చేపడుతున్న పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మునగాల మండల కేంద్రంలోని హరిజన కాలనీలో పార్టీ నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు దేవరం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. హరిజన కాలనీలో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అట్టహాసంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను ప్రారంభించిందని, కానీ అసంపూర్తిగా నిలిపివేశారని ఆ ఇళ్లను పూర్తిచేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ కార్యదర్శులు కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, ఇటికాల వెంకులు, నెమ్మాది రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగేవరకూ పోరాటం

కోదాడరూరల్ : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చట్టం రూపుదాల్చేంత వరకూ తమ పోరాటం ఆగదని ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్, ఎంస్పీ ఆధ్వర్యంలో కోదాడలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆరవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఆనందరావు, మునగాల శ్రీనివాస్, ఎండి.మజహర్, కొండపల్లి ఆంజనేయులు, సత్యరాజు, విజయరావు, స్నేహలతచౌదరి, శ్రీను, వెంకన్న, అంజిబాబు, యాదగిరి, సాయికుమార్ ఉన్నారు.

మునగాలలో..

మునగాల : ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకూ ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని మునగాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల శాఖల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, లంజేపల్లి శ్రీను మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం ఐదవ రోజుకు చేరుకుంది. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాతకొట్ల నాగరాజు మాదిగ, కొత్తపల్లి అంజయ్య మాదిగ, నాయకులు తాళ్లపాక వీరబాబు, దావీదు, గోపి, నూకపంగు గుర్వయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పెద్ద మసీదులో సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు, పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, నాయకులు దుగ్గి బ్రహ్మం, వట్టేపు సైదులు, పి.హుస్సేన్, శీలం శ్రీను, వీరమల్లు, వీరయ్య, వీరస్వామి, ముస్లిం పెద్దలు ఎండీ రఫి, బాజీ ఉల్లా, అజీజ్ పాషా, సైదా, మన్సూర్ అలీ, బిక్కన్, షఫి తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని గోవిందపురంలో రామాలయం నిర్మాణంతో తమ ఇంటికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ఇట్టిమల్ల ప్రకాష్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఉన్న స్థలంలోనే రామాలయం నిర్మించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత

నేరేడుచర్ల : మండలంలోని దాచారం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మిర్యాలగూడలోని సుప్రియ డ్రెసెస్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు వీణారాణి, ఉపాధ్యాయులు బుర్రి పుల్లయ్య, యడవెల్లి సత్యనారాయణరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు చిత్రం విశ్వనాథం, ఉప్పాల లక్ష్మారెడ్డి, సరికొప్పుల నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

సహకార సంఘం మంజూరు చేయాలి

గరిడేపల్లి : మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరు చేయాలని గ్రామస్తులు, రైతులు కోరారు. ఈమేరకు సోమవారం కీతవారిగూడెం సహకార సంఘం సీఈఓ కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో తాళ్లమల్కాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో మల్టీపర్పస్ వ్యవసాయ సహకార సంఘం ఉండేదని, పలు కారణాలతో 1980లో రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విలీనం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రాయికింది అంజయ్యగౌడ్, సాయికుమార్, అంజయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మజ్జిగ పంపిణీ

కోదాడ : వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరధనాయక్ అన్నారు. సోమవారం కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రావు, పత్తి నరేందర్, మజ్జిగ దాతలు కందిబండ నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ప్రసాద్, గీత, సతీష్‌బాబు, భరత్, మాధవి, శ్రీనివాసరావు, శ్రీరంగం లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు కోరారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాష, మస్తాన్, నాగుల్‌మీరా, శ్రీదేవి, భద్రమ్మ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, భూలక్ష్మి, వీరమ్మ పాల్గొన్నారు.

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు ఆసక్తి గల రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో 'వేసవిలో మామిడి తోటలో యాజమాన్యం, వేసవిలో అన్ని పంటల్లో యాజమాన్య పద్ధతులు'అనే అంశంపై శాస్త్రవేత్తలు తమ అమూల్యమైన అభిప్రాయాలు తెలియజేస్తారని ఆయన తెలిపారు.